క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల నమూనా మార్కింగ్



ఇళ్ల నమూనాను చూపిస్తున్న అధికారులు

మల్హర్: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన వారు సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి కావల్సిన (డిజైన్) నమూనాను సోమవారం మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ శ్రీనివాస్ సమక్షంలో హౌసింగ్ అధికారులు ముగ్గు పోసి చూపించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ శ్రీకాంత్, ఏఈలు రాయలింగు, రజినీకాంత్, ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్ మూర్తిసాగర్, కార్యదర్శి మల్లికార్జున్ పాల్గొన్నారు.

10న గురుపౌర్ణమి వేడుకలు



గణపురం: మండల కేంద్రంలోని దత్తాత్రేయ సహిత షిర్డీ సాయిబాబా ఆలయంలో ఈ నెల 10న గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు వినయ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ గురుపౌర్ణమి వేడుకలకు ఆలయ ధర్మకర్త ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఉదయం 5 గంటలకు ప్రభాతసేవ కాగడ హారతి, 6 గంటలకు సాయినాథునికి మంగళస్నానం-సంస్థాన పూజ, 7 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, అష్టోత్తర నామార్చన, సహస్రనామార్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆరగింపు, మధ్నాహ్న హారతి, తీర్థ ప్రసాద వితరణ అనంతరం ఒంటి గంటకు భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 6.15 నిమిషాలకు సంధ్యాహారతి, రాత్రి 8.45 నిమిషాలకు శేజ హారతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

షూ పంపిణీ



షూ పంపిణీ చేస్తున్న జశ్వంత్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అన్నారం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు స్థానిక ఆర్ఎంపీ వైద్యుడు జశ్వంత్ అతడి జన్మదినం సందర్భంగా సోమవారం షూ పంపిణీ చేశాడు. ఆయన వెంట గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆర్థిక సాయం

రేగొండ: మండల కేంద్రానికి చెందిన పోడేటి చిన్న సమ్మయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎంపీటీసీ పట్టెం శంకరయ్య పరామర్శించి, రూ.2వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కోయిల క్రాంతి, నాయకులు పున్నం ప్రవీణ్, రమేష్, మనోజ్, రవి, రాజయ్య, శ్రావణ్, తదితరులు ఉన్నారు.

ఒకరి రిమాండ్

కాళేశ్వరం: మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం కొల్లూర్ గ్రామానికి చెందిన జంగా రమేశ్ రెడ్డి కోర్టుకు సకాలంలో హాజరు కాకపోవడంతో మహదేవపూర్ మండలం కాళేశ్వరం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. సోమవారం భూపాలపల్లి జడ్జి అతడికి 14 రోజుల రిమాండ్ విధించారు. ఏదైనా కేసుల్లో కోర్టుకు హాజరు కావాల్సి వస్తే తప్పకుండా హాజరు కావాలని, హాజరుకాకపోతే వారిపై న్యాయపరమైన చర్యలు విధించడం జరుగుతుందని ఎస్సై తమాషారెడ్డి తెలిపారు.

ఇంటింటి సర్వే



పరీక్షిస్తున్న వైద్యాధికారి మహేందర్

వాజేడు : మండలంలోని కొంగాల గ్రామంలో వాజేడు వైద్యాధికారి కొమరం మహేందర్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రత్యేకంగా జ్వరాలపై ఆరా తీయడంతో పాటు కొందరి నుంచి రక్త పూతలను సేకరించారు. ఇంటి పరిసరాల్లో టైర్లు, ఇతర వస్తువుల్లో ఉన్న నీటిని పారబోయడంతో పాటు నీరు నిల్వ ఉన్న చోట టీమోపాస్ మందును పోశారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందించే భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట హెల్త్ సూపర్ వైజర్ కోటిరెడ్డి, వెంకట రమణ, చాయాదేవి, శేఖర్, ఆశ వర్కర్ తదితరులున్నారు.

కుక్కల స్వైరవిహారం



వెంకట్రావుపల్లిలో గుంపులుగుంపులుగా తిరుగుతున్న కుక్కలు



టేకుమట్లలో రాత్రి పూట సంచరిస్తున్న కుక్కలు

- పట్టించుకోని అధికారులు
- భయాందోళనకు గురవుతున్న ప్రజలు

టేకుమట్ల: మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా గ్రామాల్లోని వీధులు, ప్రధాన రోడ్లపై తిరుగుతూ పలువురిని గాయపరుస్తున్నాయి. గ్రామాల్లో నిత్యం సంచరిస్తూ తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఇక రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న వారికి చుక్కలు చూపిస్తున్నాయనే చెప్పాలి. రాత్రివేళ కుక్కలు ద్విచక్ర వాహనాల వెంట పడి గాయపరుస్తున్నాయి. పలు చోట్ల కుక్కలు వెంటపడగా భయాందోళనతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోయిన సంఘటనలు చాలానే ఉన్నాయి. ఎక్కడ పడితే అక్కడ పదుల సంఖ్యలో తిరుగుతూ పిల్లల వెంట పడుతూ గాయపరుస్తున్నాయి. గతంలో కుక్కల దాడిలో ఎంతో మంది పిల్లలు తీవ్ర గాయాలై చికిత్స పొంది ప్రాణాలతో బయటపడిన సంఘటనలు ఎన్నో ఉన్నా కుక్కల నియంత్రణపై అధికారులు దృష్టి సారించడం లేదని స్థానికులు వాపోతున్నారు. గ్రామాల్లో కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మా బాబుని గాయపర్చాయి..



ఇంటి ముందు ఆడుకుంటున్న మా బాబును కుక్కలు మూకుమ్మడిగా దాడీ చేసి తీవ్రంగా గాయపర్చాయి. కుక్క కాటు పొట్టలో దిగడంతో టీకా వెలిశాల, చిట్యాల ఆస్పత్రుల్లో లేకపోవడంతో వరంగల్ ఎంజీఎంకి వెళ్లాం. మండల కేంద్రంలో కొన్ని సంవత్సరాలుగా కుక్కలు రోడ్లపై స్వైర విహారం చేస్తూ ఎంతో మందిని గాయపరుస్తున్నాయి. కుక్కలను నియంత్రించడానికి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం లేదు. ఇప్పటికైనా కుక్కల బెడద తగ్గించడానికి అధికారులు దృష్టిసారించాలి.

- బమాచర్ల రాజేష్, టేకుమట్ల

కన్నెపల్లి మోటార్లు ఆన్ చేసి నడిపించాలి

- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

కాళేశ్వరం: కన్నెపల్లి మోటార్లు ఆన్ చేసి నడిపించి వరద ప్రవాహాన్ని ఎత్తిపోయాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. సోమవారం మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిధి కన్నెపల్లి పంపుహౌజ్ అప్రోచ్కాల్వ వద్ద గోదావరి ప్రవాహాన్ని ఆయన పరిశీలించి విలేకర్లతో మాట్లాడారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ప్రస్తుతం మహారాష్ట్ర నుంచి వస్తున్న వరద ప్రవాహాన్ని కన్నెపల్లి మోటార్ల ద్వారా ఎత్తిపోసే అవకాశమున్న రేవంత్ సర్కార్ నిర్లక్ష్యం చేసి, రైతులను మోసం చేస్తుందన్నారు. ప్రాజెక్ట్లోని మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూసి నీటి నిల్వ చేయకుండానే కన్నెపల్లి పంప్హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసే అవకాశముందని అన్నారు. ఇప్పటి వరకు వర్షాలు లేకపోవడంతో గోదావరి పరివాహక ప్రాంతాల్లో చెరువులు, కుంటలు, కాలువలు నీరు లేక ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును రేవంత్ సర్కార్తో కలిసి స్థానిక ఎమ్మెల్యే, మంత్రి శ్రీధర్ బాబు నిర్లక్ష్యం చేశారన్నారు. నియోజకవర్గంలోని అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీరు లేక ఎండిపోయాయన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు వట్టిపోయాయని, మత్స్య సంపదకు ఆటంకాలు ఏర్పడ్డాయన్నారు. ఈ వరద నీటిని ఎత్తిపోస్తే తెలంగాణలోని సుమారు 15 జిల్లాలకు నీరు సరఫరా చేయొచ్చని తెలిపారు. ఆయన వెంట నాయకులు వెన్నపురెడ్డి మోహన్రెడ్డి ఉన్నారు.

ఇంటర్నేషనల్ అవార్డుకు నరేందర్ ఎంపిక



ఎంపిక పత్రాన్ని అందుకుంటున్న నరేందర్

చిట్యాల: మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన ప్రముఖ విద్యావేత్త, లక్ష్మీవిద్యానికేతన్ కరస్పాండెంట్ నూనే నరేందర్ బెస్ట్ సర్వీస్ సొసైటీ ఇంటర్నేషనల్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు సెప్టెంబర్ 5న తిరుపతిలో నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో అవార్డును ప్రదానం చేయనున్నారు. సోమవారం బహుజన సాహిత్య అకాడమీ హైదరాబాద్ జాతీయ కార్యాలయంలో బెస్ట్ సర్వీస్ సొసైటీ ఇంటర్నేషనల్ మంజూరి లేఖను బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ చైర్మన్ నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా నూనే నరేందర్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల విజయ్కుమార్, అవార్డుల సెలక్షన్ కమిటి జిల్లా అధ్యక్షుడు తాటికంటి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు



అవగాహన కల్పిస్తున్న ముస్కాన్ టీం సభ్యులు

మల్హర్: బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని ఆపరేషన్ ముస్కాన్-ఎక్స్ఐ కాటారం సబ్ డివిజన్ ఇన్చార్జ్ ఎస్సై ఓంపాల్, సహాయ కార్మిక అధికారి వినోద హెచ్చరించారు. జూలై 1 నుంచి 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని కొయ్యూరు గ్రామ పరిసరాలలో బాల కార్మికుల కోసం రెక్కీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈరెక్కీలో ఇద్దరు బాల కార్మికులను గుర్తించి వారిని బాలల సంక్షేమ సమితి ఎదుట వీడియో కాల్ ద్వారా హాజరు పర్చినట్లు తెలిపారు. వారి ఆదేశాలతో బాలలను స్వరాష్ట్రాలకు పంపడానికి జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బాలలను పనిలో పెట్టుకున్న యజమానులపై కొయ్యూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. బాలలను పనుల్లో పెట్టుకోవద్దని షాపు యజమానులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి వెంకటస్వామి, ఆపరేషన్ ముస్కాన్ టీం సభ్యులు పాల్గొన్నారు.

బూత్, మండల స్థాయి అధికారులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

గణపురం: మండల కేంద్రంలోని రైతువేదికలో బూత్ స్థాయి, మండల స్థాయి అధికారులకు సోమవారం శిక్షణ, ఓరియంటేషన్ నిర్వహించినట్లు తహసీల్దార్ సత్యనారాయణస్వామి తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి రాష్ట్ర స్థాయి శిక్షణ అధికారులు నక్క తిరుపతి, గోనె శ్రీనివాస్, నరేష్ హాజరై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.


ల్యాబ్పై ఉపాధ్యాయులకు శిక్షణ



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

చిట్యాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో అటల్ ఇన్నోవేషన్ మారథాన్ అనే నినాదంతో అటల్ టింకరింగ్ ల్యాబ్స్పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కోర్స్ డైరెక్టర్ లక్ష్మణ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో నీతి అయోగ్ సూచనల మేరకు ఏడు పాఠశాలలకు రూ.10 లక్షలతో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ను భారత ప్రభుత్వం ఎంపిక చేసిందని అన్నారు. జిల్లా నుంచి ఏడు పాఠశాలలో సైన్స్, మ్యాథ్స్, బయోసైన్స్ టీచర్లు ఒక్కొక్క పాఠశాలకు ముగ్గురు చొప్పున ఉపాధ్యాయులను శిక్షణ కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి బి. స్వామి, ప్రిన్సిపాల్ భిక్షపతి, ఎంఈఓ రఘుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



మాట్లాడుతున్న రవీందర్

భూపాలపల్లి రూరల్: ప్రభుత్వ పాఠశాలకు పిల్లలు రావాలంటే ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరి రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని గత నెలలతో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్లకు గ్రీవెన్స్లో వినతి పత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటివరకు కూడా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. జిల్లా కోశాధికారి బొజ్జ పెళ్లి మహర్షి, నాయకులు పుల్ల అశోక్ పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

- వైద్యాధికారి నాగరాణి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నాగరాణి

మొగుళ్లపల్లి: ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని మండల వైద్యాధికారి నాగరాణి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్సీ, బీసీ హాస్టల్ విద్యార్థులకు సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 110 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు సీజన్ వ్యాధుల గూర్చి అవగాహన కల్పించారు. వేడి వేడి ఆహార పదార్థాలు తినాలని సూచించారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు ఉన్నట్లయితే వైద్య సిబ్బంది తెలపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విజయపాల్రెడ్డి, సూపర్వైజర్ సునీత, ఏఎన్ఎం శ్రీలత ఆశ కార్యకర్తలు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న రాజ్కుమార్

కాళేశ్వరం: విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజ్కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ బాలికల పాఠశాలలో సోమవారం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యార్థులు 300 మంది వరకు ఉన్నారని, అందులో 200 మంది వరకు బాలికలు, 100మంది బాలురు ఉన్నప్పటికీ వారికి ఒకే మరుగుదొడ్డి ఉండడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



గ్రామంలో పీరీలను ఊరేగిస్తున్న భక్తులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మొహర్రం పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. త్యాగాలకు ప్రతీకగా నిలిచిన పీరీల ముందు పలువురు భక్తులు డప్పు చప్పుల్ల మధ్య పలు వేషాధారణలతో నృత్యాలు చేశారు. సోమవారం చివరి రోజున సాయంత్రం గ్రామంలో పీరీలతో నిర్వాహకులు సయ్యద్ వాజీద్ ఆధ్వర్యంలో ఊరేగింపు చేశారు. మతాలకు అతీతంగా భక్తులు దట్టీలు, కుడుకలు, పూలదండలు పీరీలకు కట్టి సల్లంగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. బెల్లం షర్బత్, పాయసం, మలీద ముద్దలు చేసి భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం గోదావరిలో నిమజ్జనం చేశారు.

సమ్మెతో ఉద్యోగులకు నష్టం

- సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి



గణపురం: కార్మికులతో మాట్లాడుతున్న జీఎం

గణపురం: జూలై 9న కార్మిక సంఘాల పిలుపు మేరకు నిర్వహించనున్న జాతీయస్థాయి సమ్మెలో ఉద్యోగులు పాల్గొంటే వేతనాల పరంగా నష్టపోతారని ఈ విషయంగా కార్మికులు ఆలోచించాలని సింగరేణి ఏరియా జీఎం రాజేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం ఓసీ-3 ప్రాజెక్టులో రెండవ షిఫ్ట్లో కార్మికులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మెకు కారణమైన 18 డిమాండ్లు సింగరేణికి సంబంధించినవి కావన్నారు. ఈ అంశాలపై నిర్ణయం తీసుకునే అధికారం ఎస్సీసీఎల్కు లేదన్నారు. సమ్మెలో పాల్గొనడం వలన జీతనష్టం వాటిల్లుతుందని చెప్పారు. ఎస్సీసీఎల్ మేనేజ్మెంట్ విడుదల చేసిన సమ్మె అవగాహన పోస్టర్ను విడుదల చేసి ఉద్యోగులు విధులకు యధావిధిగా హాజరుకావాలని సూచించారు. సమ్మెలో పాల్గొంటే భూపాలపల్లి ఏరియాలో సుమారుగా 1.84 కోట్ల ఆర్థికనష్టం వాటిల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మైన్ మేనేజర్లు శ్రీనివాస్, రాంబాబు, మధుసూదన్, వేల్ఫేర్ ఆఫీసర్ సాయికృష్ణ పాల్గొన్నారు.

సమ్మెకు దూరంగా ఉండాలి

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే ఒక్కరోజు సమ్మెకు కార్మికులు దూరంగా ఉండాలని ఏరియా అధికార ప్రతినిధి మారుతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమ్మెలో అత్యధిక డిమాండ్లు సింగరేణి ఉద్యోగులకు సంబంధించినవి కావని, యాజమాన్యం పరిష్కరించే సమస్యలు లేవన్నారు. సింగరేణి కార్మికులు దేశవ్యాప్త సమ్మెలో పాల్గొన అవసరం లేదన్నారు. సమ్మెతో ఉద్యోగులు ఆర్థికంగా చాలా నష్టపోతారని విధులకు హాజరుకావాలని సూచించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ సంపత్రావు

- భూపాలపల్లి డీఎస్పీ సంపత్రావు

భూపాలపల్లి రూరల్: ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని భూపాలపల్లి డీఎస్పీ సంపత్రావు అన్నారు. సోమవారం భూపాలపల్లి మండలంలోని నేరేడుపల్లిలో నిర్వహించిన కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై డీఎస్పీ స్థానికులు వివరించారు. సరైన పత్రాలు లేని 42 ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. పలువురు ఎస్సైలతో పాటు 45మంది పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నానో యూరియాతో పెట్టుబడి ఆదా..

- మండల వ్యవసాయాధికారి కల్యాణి



పంటలను పరిశీలిస్తున్న కల్యాణి

టేకుమట్ల: యూరియా గుళికల కన్నా ప్రస్తుతం మార్కెట్లో లభ్యమయ్యే నానో యూరియాతో రైతులు పెట్టుబడిని ఆదా చేసుకోవచ్చునని మండల వ్యవసాయాధికారి కల్యాణి అన్నారు. సోమవారం మండలంలోని పంగిడిపల్లి, వెలిశాల గ్రామాలలో రైతులు సాగు చేస్తున్న పత్తి పంటలను పరిశీలించారు. మొక్కలు పెరిగేందుకు రైతులు ఎక్కువగా కాంప్లెక్స్ ఎరువులనే వినియోగిస్తుంటారని అన్నారు. కాంప్లెక్స్ ఎరువుల వాడకం వల్ల నేల స్వభావాన్ని కోల్పోతుందని, మొక్కలకు కావల్సిన పోషకాలు అందవని అన్నారు. పంటలకు మార్కెట్లో లభ్యమయ్యే నానో యూరియాను పిచికారీ చేయడం వల్ల నేల సారవంతంగా ఉండడమే కాకుండా తక్కువ ఖర్చుతో పంటలకు పోషకాలు అందుతాయని అన్నారు. ఆమె వెంట వ్యవసాయ విస్తరణ అధికారులు రాహుల్, అరుణ్ ఉన్నారు.

సమ్మె రోజు సెలవు ప్రకటించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

రేగొండ: ఈ నెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో విద్యాశాఖ సిబ్బందికి సమ్మె సందర్భంగా ఒక రోజు సెలవు ప్రకటించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం పద్మ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సమ్మెలో రెండు మండలాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు భాగ్య, లక్ష్మీ, వసంత, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



భూపాలపల్లి రూరల్: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



పలిమెలలో..

జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఆ సంఘం నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. అలాగే సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జెండాని ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. - సాక్షి నెట్వర్క్



కాళేశ్వరంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



టేకుమట్ల: కేక్ తినిపించుకుంటున్న నాయకులు



తాడిచర్లలో..